క్లుప్తంగా

ముగిసిన వాలీబాల్ ఉచిత శిక్షణ



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న పాండురంగరాజు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో రెండు నెలల పాటు నిర్వహించిన వాలీబాల్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 50 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో క్రీడాకారులకు క్రీడాకోటలో ఉచితంగానే విద్యనందిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ జి మోజెస్, కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ కె రామకృష్ణంరాజు, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్ రామకృష్ణంరాజు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బీవీ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మోషేనురాజుకు అభినందనలు



మోషేనురాజును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం: శాసనమండలి సభ్యునిగా పదవీ బాధ్యతలు స్వీకరించి సోమవారం నాటికి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కొయ్యే మోషేనురాజుకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. పట్టణంలోని మోషేనురాజు క్యాంపు కార్యాలయంలో పార్టీ భీమవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు నేతృత్వంలో పార్టీ నాయకులు కేక్ కట్‌చేశారు. మోషేనురాజుకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్, కోడే యుగంధర్, బలే ఏసుబాబు, బోకూరి విజయరాజు, బి ధర్మా, బుంగా ప్రహ్లాదుడు, కందుల కాశీ, గాజుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18న డబుల్ మేజర్‌పై అవగాహన సదస్సు

ఆకివీడు: డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు డబుల్ మేజర్‌పై నూతన విద్యా ప్రణాళికను 2025–26 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పీబీ. ప్రతాప్ కుమార్ చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం డబుల్ మేజర్‌లోనే ఉంటుందన్నారు. దీనిపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 18న కళాశాల ఆవరణలో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై తమ సందేహాల్ని నివృత్తి చేసుకోవాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరం నందు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువగల ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెగ్యులర్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మార్పిడి పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు సోమవారం చెప్పారు. నరసయ్య అగ్రహారం, అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

భీమవరం: ఒకటో పట్టణంలోని చినపేటకు చెందిన ఎస్.పాలుపై ఇద్దరు వ్యక్తులు దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

భీమవరంలో ట్రాఫిక్ యాతన

- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బందులు
- పీపీ రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డులో ఇష్టానుసారంగా కార్ల పార్కింగ్
- వెంకట్రామా టాకీస్ రోడ్డులోనూ అదే పరిస్థితి
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



భీమవరంలో బుధవారం మార్కెట్ వద్ద ట్రాఫిక్ జామ్



తాడేపల్లిగూడెం రోడ్డులో డీ మార్ట్ వద్ద రోడ్డుపై కార్లు పార్కింగ్‌తో రద్దీ

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని ప్రధాన రహదారి పీపీ రోడ్డు, ఇతర ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం మీదుగా ఉన్న పీపీ రోడ్డుకు సంబంధించి ఇటు బుధవారం మార్కెట్ దగ్గర నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ వరకు, అటు అడ్డ వంతెన దగ్గర నుంచి గాంధీ చౌక్ వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన తర్వాత ట్రాఫిక్ పోలీసుల సంఖ్య పెరిగినా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. నిబంధనలు పాటించకుండా ఎక్కడబడితే అక్కడ కార్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం, వన్‌వేలోకి ఎదురుగా వాహనాలు వచ్చినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

- పాలకొల్లు వైపు నుంచి ఓవర్ బ్రిడ్జి దిగి బుధవారం మార్కెట్ నుంచి ఎడమవైపు తిరిగి వెళ్లే వాహనాలకు ఎదురుగా నిబంధనలు మీరి వాహనాలు రావడంతో ఆ రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది.
- బస్టాండ్ నుంచి ఇండియన్ బ్యాంకు రోడ్డు వన్‌వే రోడ్డులో ఇష్టానుసారంగా ఎదురుగా వాహనాలు రావడం, ఇరుకు రోడ్డు కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.
- టూటౌన్‌లో అభిరుచి హోటల్ దగ్గర నుంచి అడ్డ వంతెన వరకు ట్రాఫిక్ సమస్యే.
- ఉండి రోడ్డులో గేట్ పడితే చాలు కిలోమీటరు మేర ట్రాఫిక్ పాట్లే.
- బంగారం షాపులు ఉండే వెంకట్రామా టాకీస్ రోడ్డులో ఇష్టనుసారంగా రోడ్డుపైకి వాహనాలను పార్కింగ్ పెట్టి షాపింగ్ చేయడంతో అక్కడ అదే పరిస్థితి.
- తాలుకా ఆఫీసు రోడ్డు నుంచి మావుళ్లమ్మ దేవస్థానం రోడ్డులోనూ ట్రాఫిక్ సమస్య దారుణం. మనుషులు నడవడమే కష్టంగా ఉండే ఆరోడ్డులో కార్లు, ఆటోలు రాపోకలు సాగించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

సాయంత్రం నుంచి ట్రాఫిక్ నరకం

భీమవరం పట్టణంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఏర్పడే ట్రాఫిక్ సమస్యతో పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. సెట్ బ్యాక్ వదలకుండా నిర్మించిన షాపుల వల్ల వాహనాలు వాటికి ఎదురుగా రోడ్డుపై పెట్టడం, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ సరిపడా ఉండకపోవడంతో ఎక్కడ వాహనాలు అక్కడ ఆగిపోయి ముందుకు, వెనకకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. దాంతో ఆటోల్లో, ఇతర వాహనల్లో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డీమార్ట్ వద్ద ఇష్టానుసారంగా పార్కింగ్

తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న డీమార్ట్ వద్ద షాపింగ్‌కు వచ్చేవారు కార్లు, ఆటోలు రోడ్డుపైకి పార్కింగ్ చేయడంతో అక్కడ ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అక్కడ ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా రద్దీ తగ్గడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో కఠినంగా వ్యవహరించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. అలాగే నిబంధనలు పాటించకుండా సెట్ బ్యాక్ వదలకుండా నిర్మించిన భవనాలపై తగు చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుంది.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించండి



బదుగు బాలాజీ, పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి, ఉండి

ఉండి: రైతులకు రబీ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బదుగు బాలాజీ సోమవారం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ తీరు.. పేరుగొప్ప ఊరు దిబ్బ అనే సామెతలా ఉందని అన్నారు. కబుర్లు చెప్పడంలో కూటమి ప్రభుత్వం ఆరితేరిందని ఎద్దేవా చేశారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లో సొమ్ము నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తామని చెప్పి ఇప్పుడు రైతులను మోసం చేశారన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలోని రైతులకు రూ.295 కోట్లు ధాన్యం సొమ్ము బకాయి పెట్టారని మండిపడ్డారు. రైతుల సొమ్ము ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చారని, గత ఏడాది మొండి చేయి చూపించారని, ఈ ఏడాది ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో రైతు భరోసా సకాలంలో వచ్చేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారన్నారు. గొప్పలు చెప్పుకోవడం మాని కూటమి ప్రభుత్వ పెద్దలు రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

యోగాంధ్ర విజయవంతంపై శ్రద్ధ వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్, మండల, సచివాలయ స్థాయిలో యోగ అభ్యసన కార్యక్రమాల నిర్వహణ, యోగ అభ్యాసకుల హాజరు తదితర అంశాలపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు.

ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం: భీమవరం ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో తుమ్మలపెంట పద్మనాభం, కారుమూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కారుమూరి భాస్కరరావు, తుమ్మలపెంట రంజిత్‌కుమార్, కోశాధికారిగా గొంట్ల వెంకటరామారావు, ఉపాధ్యక్షునిగా గాదంశెట్టి సతీష్, సహాయ కార్యదర్శిగా గొంట్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ భీమారావు

భీమవరం: బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు శక్తి యాప్‌ను ఆపత్కాలంలో వినియోగించుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు సూచించారు. సోమవారం భీమవరంలోని తిరుమల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శక్తి మొబైల్ యాప్ వినియోగం, జిల్లాలో శక్తి టీమ్స్ పనితీరు, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించిన పలు అంశాలపై విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు తమపై జరిగే ఏ నేరామైనా ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా, భీమవరం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

- సంక్షేమ పథకాలు ఇచ్చేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



పార్టీ కార్యాలయంలో పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు, ఉండి నియోజకవర్గ నాయకులు

కాళ్ల: రాష్ట్ర ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు తెలిపారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో ఉండి నియోజకవర్గ స్థాయి నాయకులతో "జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం.." అనే పుస్తకాన్ని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అధికారం వచ్చాక చేసే పనులకు ఎంతో తేడా ఉంటుందని తెలియజేశారు. సూపర్ సిక్స్ అనే హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఈ విషయాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథం లాగా భావించి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసే చరిత్ర చంద్రబాబుదని ఘాటుగా విమర్శించారు. తల్లికి వందనం పేరుతో 30 లక్షల మంది పిల్లలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇవ్వకుండా ఎవరో కొంతమందికి తల్లికి వందనం ఇచ్చినట్లు చూపించి సంబరాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెండ్ర వీరన్న, ఉండి మండల కన్వీనర్ పెన్మత్స ఆంజనేయరాజు, అంబటి రమేష్, చేకూరి నరేంద్రవర్మ, కొండేటి శివకుమార్, మంతెన సునీల్ వర్మ, డొక్కు సుబ్రహ్మణ్యం, జగన్నాథరాజు, చిగురుపాటి సందీప్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన అంశాలపై అధ్యాపకులకు శిక్షణ అవసరం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు

భీమవరం: విద్యార్థులకు నూతన అంశాలపై పాఠ్యాంశాలు బోధించాలంటే అధ్యాపకులు ముందుగానే వాటిపై శిక్షణ పొంది సిద్ధంగా ఉండాలని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. కళాశాలలో సోమవారం కష్టం అండ్ సెమీ – కష్టం ఐసీ డిజైన్ యూజింగ్ క్యాడెన్ టూల్స్ అనే అంశంపై అధ్యాపక శిక్షణ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో ఎన్ఐటి వరంగల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జేఎన్టీయూకే ప్రత్యేకించి అధ్యాపక శిక్షణకు అధిక ప్రాధాన్యతిస్తుందని ఆన్‌లైన్‌లో కంటే ఆఫ్‌లైన్‌లో శిక్షణ మరింతగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దేశంలో పేరొందిన సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు వచ్చి నూతన టెక్నాలజీని అందించనున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెర్టాక్ సేవలు అభినందనీయం



కాళ్ళలో సోలార్ వీధిలైట్లు ప్రారంభిస్తున్న వెర్టాక్ ఆర్‌బీఎం సత్యనారాయణ తదితరులు

కాళ్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం "వెర్టాక్" సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. కాళ్ల గ్రామంలో "వెర్టాక్" సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ, గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లాలంటే గ్రామస్తులు వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నారని తమ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గాదిరాజు కిరణ్ కుమార్ వర్మ, నారిన శ్రీనివాసరావు, వర్రె శివ తెలపడంతో సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ఒక ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతోపాటు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన సంస్థకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో "వెర్టాక్" సంస్థ బిజినెస్ ఆఫీసర్ డీఎం రాజు, కిషోర్ నాయుడు, నారిన శ్రీనివాసరావు, బండారు నాని, సోమేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పాలకోడేరు హైస్కూల్‌కి ప్రింటర్, బీరువా అందజేసిన పూర్వ విద్యార్థులు

పాలకోడేరు: పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1999 – 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50 వేల విలువైన జిరాక్స్ ప్రింటర్, ఐరన్ బీరువాను ప్రధానోపాధ్యాయులు పి.మహేష్ బాబు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. అంతేకాకుండా ఈ సంవత్సరం పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ప్రవల్లికశ్రీకి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మహేష్ బాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మస్తాన్, సుబ్బారావు, కనకరావు, కోదండ రామరాజు, పి.వాసు, కడిమి కళ్యాణ్ బాబు, జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మరమ్మతులు



ఎన్నార్పీ అగ్రహారంలో వర్షంలో హైవేరోడ్డు ప్యాచ్ వర్కు చేస్తున్న దృశ్యం

ఉండి: హైవే మరమ్మతు పనులు తూతూమంత్రంగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా హైవే మరమ్మతుల పేరుతో నచ్చినట్లు గుంతలు పూడుస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్న గుంతలను వదిలి వారికి సులువుగా మరమ్మతులు పూర్తయ్యేలా ఉన్న గోతులను మాత్రమే పూడ్చుతున్నారు. ఉండి నుంచి భీమవరం వరకు చేపట్టిన మరమ్మతుల్లో భాగంగా ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ పెట్రోల్ బంక్ వద్ద ప్యాచ్ వర్కు చేస్తుండగా సోమవారం సాయంత్రం భారీ వర్షం వచ్చింది. సుమారు అరగంటపాటు దంచి కొట్టింది. అయితే రోడ్డు పనులు మాత్రం ఆగకపోవడం గమనార్హం. భారీ వర్షంలో కొద్దిసేపు పనులు నిలిపిన కార్మికులు వర్షం ఆగకపోవడంతో అలాగే రోడ్డు ప్యాచ్‌వర్కులు చేసేసి సాయంత్రానికి పని ముగించేశారు. అంతంత మాత్రంగానే నాణ్యత కలిగిన పనులు చేస్తున్న ఈ రోజుల్లో వర్షంలో రోడ్డు ప్యాచ్ వర్కు చేస్తే దాని ప్రతిఫలం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. రోడ్డు పక్కన వుండే బురద గానీ, నిలిచిన వర్షపు నీరు గాని మాకు అడ్డుకాదు అన్నట్టు కార్మికులు పనులు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజాధనాన్ని ఈ రకంగా వృథా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!

- దుర్గంధంలోనే హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని కమిషనర్



పెదపేటలోని సాంఘికసంక్షేమ శాఖ హాస్టల్ ప్రాంతంలో మురుగునీరు

ఆకివీడు: స్థానిక పెదపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వద్ద డ్రెయినేజీ మురుగునీరు నేరుగా హాస్టల్ ప్రాంగణంలోకి రావడంతో దుర్గంధం భరించలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ స్థానిక ఈ హాస్టల్‌ను, అదే ప్రాంతంలో ఉన్న సచివాలయ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో డ్రెయినేజీ నీరు ఆయా ప్రాంగణాల్ని ముంచెత్తడంతో విద్యార్థులు ఏవిధంగా ఇక్కడ నివసిస్తారని కమిషనర్‌ను కలెక్టర్ నిలదీశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మారడంతో సమస్య పరిష్కారం కాలేదు. దుక్కి వర్షానికి డ్రెయినేజీలోని మురుగు నీరు హాస్టల్ ప్రాంగణం, సచివాలయ ప్రాంగణంను ముంచెత్తుతోంది. మురుగు నీరు హాస్టల్ ప్రాంగణంలో నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా ముక్కులు మూసుకుని పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. స్వచ్ఛ ఆకివీడు కార్యక్రమాలతో పాటు ప్రతి నెలా డ్రైడే నిర్వహిస్తున్నారని, నెలకు ఒకసారి మండల స్థాయి అధికారులు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యల్ని తెలుసుకుంటున్నా కంపు, మురుగు నీరు పోయేందుకు మాత్రం చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ నాగరాణి స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చెత్తాచెదారం



అపారిశుద్ధ్యంతో నిండి ఉన్న రైల్వే క్యాబిన్ రోడ్డు



చెత్తాచెదారంతో సిద్ధాపురం వైపు రైల్వే స్టేషన్ రోడ్డు

ఆకివీడు: స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్నప్పటికీ రైల్వే శాఖ మాత్రం దీనిని అమలు చేయడంపై శ్రద్ధ చూపడం లేదు. రైల్వే స్టేషన్ ప్రాంగణాలు అపారిశుద్ధ్యం, చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. పలు చోట్ల చిట్టడవుల్ని తలపిస్తూ పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. స్టేషన్ ప్రాంగణాల్లో ఈ విధంగా ఉండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ఆయా ప్రాంతాల నుంచి స్టేషన్‌కు వెళ్లాలంటే దుర్వాసన, పాముల బెడద తలెత్తుతోంది. గూడ్సు షెడ్డు ప్రాంగణాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. గూడ్సు బోగీల నుంచి వ్యర్థాల్ని తీసి బయటపారవేస్తున్నారు. పాలిథిన్ టార్పాలిన్లు, ఇతర వ్యర్థాలతో స్థానికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అంతేకాకుండా రైల్వే కొలిమిలు దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రయాణికులు వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని చినరంగనిపాలెం పుంతకుచెందిన డి. ప్రియాంకను కులం పేరుతో ఇద్దరు వ్యక్తులు తిట్టారని ఫిర్యాదు అందిందని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నించినా కుదరకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధిలోని అండర్‌పాస్ దగ్గర ద్విచక్రవాహనం జారిపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఒకటో పట్టణం చినరంగనిపాలేనికి చెందిన పి.వెంకటేశ్వరరావు (59) ఈ నెల 5న ద్విచక్రవాహనంపై వెళ్తూ అండర్ పాస్ వద్ద జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును మెరుగైన చికిత్సకు కాకినాడలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.